సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



ఆస్పత్రికి గ్రహచారం

యాచారం సీహెచ్‌సీకి శాశ్వత భవన నిర్మాణం లేనట్లే కనిపిస్తోంది. -2లో



ఆదాయ సముపార్జన

పన్నుల ద్వారా ఉప రవాణాకు రూ.కోట్లలో ఆదాయం వచ్చింది. -2లో

న్యూస్‌రీల్

నేడు కందుకూరు చౌరస్తాలో రైతు ధర్నా

హాజరుకానున్న కేటీఆర్, సబితారెడ్డి

కందుకూరు: రైతు రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కందుకూరు చౌరస్తాలో ధర్నా చేపట్టనున్నారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేటితో ముగియనున్న సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డీఎస్సీ–2024లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగియనుంది. ఎల్బీనగర్‌లోని బహదూర్ గూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన కొనసాగుతుంది. అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాల్సి ఉంది. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఒక ప్రకటనలో సూచించారు.

గడ్డిఅన్నారం పాలకవర్గం ప్రమాణస్వీకారం నేడు



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ నూతన పాలకవర్గం శనివారం బాటసింగారంలోని మార్కెట్ ఆవరణలో ప్రమాణస్వీకారం చేయనుంది. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు చేయనున్న ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు సభా ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి సీఐ అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

డీఎస్సీ ఫలితాల విడుదల అన్యాయం

- 'వర్గీకరణపై మాట తప్పుతారా?
- ఎంఎస్‌పీ సీనియర్ జాతీయ నాయకుడు మద్దిలేటి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడం అన్యాయమని ఎంఎస్‌పీ సీనియర్ జాతీయ నాయకుడు మద్దిలేటి అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడం మాదిగలను విస్మరించడమేనని అన్నారు. నిండు అసెంబ్లీలో వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాటమార్చడం తగదని హితవు పలికారు. వర్గీకరణ చేయకుండా డీఎస్సీ ఫలితాల్లో మాదిగలను విస్మరించినందుకు నిరసనగా డీఎస్సీ ఉద్యోగులకు నియామక పత్రాలు ఇచ్చే రోజున అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణపై స్పందించకపోతే సీఎం రేవంత్‌రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వర్గీకరణపై ప్రభుత్వం చర్చించి మదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, కృష్ణ, భాను ప్రసాద్, రత్నం, రమేశ్, కిరణ్, చిన్నోళ్ల అనంతయ్య, కిరణ్‌పూలే, అమర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు చెర.. నీళ్లు చేరేదెలా?

సాక్షి ఫోకస్

కబ్జాదారుల గుప్పిట్లో చెరువులు, కుంటలు, వరద కాల్వలు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- రియల్టర్ల చేతుల్లో చిక్కి విలవిల
- చుక్కనీరు చేరక వెలవెల
- ఏకధాటి వర్షాలకు సైతం నిండని వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని పలు చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తుండగా మరి కొన్ని చుక్క నీరు చేరక వెలవెలబోతున్నాయి. నెల రోజుల నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నా.. భారీ వరదలు ముంచెత్తుతున్నా ఆయా చెరువుల్లోకి నీరు చేరక పోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతంలోని చెరువులు, కుంటల్లోకి వరదను మోసుకొచ్చె కాల్వలు కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లడంతో ఆయా చెరువులు, కుంటలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో మెజార్టీ చెరువులు ఔటర్‌కు అటు, ఇటుగా విస్తరించి ఉన్నాయి. ఇక్కడి భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కళ్లు ఈ చెరువులపై పడ్డాయి. ఆక్రమణదారులు అడిగిందే తడవుగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను పట్టించుకోకుండా రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల అధికారులు ఎన్‌ఓసీలు జారీ చేశారు. హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్పీ నంబర్లు జారీ చేయడంతో అనేక చెరువులు ఇప్పటికే ఆనవాళ్లు కోల్పోయాయి. ఉన్నవి కూడా భారీ వర్షాలు కురుస్తున్నా నీరు చేరడం లేదు.



ఎర్రకుంట.. కబ్జాదారుల కంట

ఇది బండ్లగూడ జాగీరు మున్సిపాలిటీ పరిధిలోని కిస్మత్‌పూర్ ఎర్రకుంట. 15.6 ఎకరాల్లో ఉండాల్సిన ఈ చెరువు ప్రస్తుతం 10 ఎకరాలు కూడా లేదు. చెరువు చుట్టూ భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలిశాయి. వరద కాల్వలు కబ్జాదారుల చేతిలో చిక్కాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. నగరానికి ఆనుకుని ఉన్న ఎర్రకుంటలో మాత్రం చుక్క నీరు చేర లేదు.



❖ చవటకుంట.. రియల్టర్ల గుప్పిట

ఇది మంచాల మండలంలోని జాపాల చవటకుంట. 2.28 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన ఈ చెరువు ప్రస్తుతం రెండు ఎకరాలకే పరిమితమైంది. ఎగువ భాగంలో ఉన్న వాగులు, వంకలు రియల్టర్ల గుప్పిట్లో చిక్కి విలవిల్లాడుతున్నాయి. భారీ వర్షాలు కురిసినా వరదనీరు చెరువులోకి చేరని పరిస్థితి. ప్రస్తుతం ఈ చెరువులోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. కుంట మధ్యలోని లోతట్టు ప్రాంతంలో కొద్దిపాటి నీరు ఉండగా, అందులోనే గ్రామస్తులు బ తుకమ్మలను నిమజ్జనం చేయాల్సి వచ్చింది. నీటిలో తేలియాడాల్సిన బతుకమ్మలు ఎండు భూమిలో వాడిపోయి కన్పిస్తున్నాయి.

❖ పేరుకే 'పెద్ద'చెరువు

ఇది కుంట్లూరులోని పెద్ద చెరువు. దీనికి ఆనుకునే మరో చిన్న చెరువు కూడా ఉంటుంది. కుంట్లూరు సహా హయత్‌నగర్, వనస్థలిపురం తదితర కాలనీల్లో నుంచి వరదనీరు వచ్చి చేరుతుంది. కుంట్లూరు విలేజీకి, పెద్ద చెరువుకు మధ్యలో చిన్న చెరువు ఎగువ భాగంలోని భూముల్లో రియల్ వెంచర్ వెలిసింది. కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వరద నీరు చేరే పరిస్థితి లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. చుట్టూ ఉన్న చెరువులన్నీ నీటితో కళకళలాడుతుంటే.. కుంట్లూరు చెరువు మాత్రం వెలవెలబోతోంది.





❖ ప్రేమావతిపేట్.. 'రియల్' ఫీట్

ఇది హైదరాబాద్, బెంగళూరు జాతీయ రహదారికి సమీపంలో కన్పించే ప్రేమావతిపేట్ పెద్ద చెరువు. సర్వే నంబర్ 81 నుంచి 89 వరకు 97.26 ఎకరాలు ఉంటుంది. ఒకవైపు బయోడైవర్సిటీ పార్కు, మరోవైపు వ్యవసాయ వర్సిటీ భూములు ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టా భూములను కొనుగోలు చేసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఏకంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను చెరబట్టింది. ఎగువనున్న గుట్ట నుంచి వరద నీరు వచ్చి ఈ చెరువులో చేరుతుంది. వరద ఎక్కువై అలుగు పోస్తే..ఆ నీరు కిందికి వెళ్లిపోకుండా సదరు రియల్ ఎస్టేట్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా చెరువును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పుకొంటూ.. అటు వైపు వెళ్లేందుకు దారి లేకుండా చేసింది.

❖ బాతుల చెరువు.. ఉనికి కరువు

ఇది హయత్‌నగర్ నుంచి మునుగనూర్‌కు వెళ్లే మార్గంలోని బాతులచెరువు. చెరువు చుట్టూ బహుళ అంతస్తుల నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. ఎగువ ప్రాంతాల్లోని వరద కాల్వలు పూర్తిగా కనుమరుగయ్యాయి. మురికి కూపంగా మారింది. చెరువు కింది భాగంలోని అలుగు ఆనవాళ్లు లేకుండా పోయింది. చెరువు ఎగువ భాగంలోనే కాదు దిగువ భాగంలోనూ నిర్మాణాలు వెలిశాయి. నగరంలో ప్రతి రోజూ భారీ వర్షాలు, వరదలు వస్తున్నా.. ఇప్పటికీ ఈ చెరువు మాత్రం నిండలేదు.





❖ పెద్దచెరువు.. అక్రమ నిర్మాణాలకు నెలవు

ఇది మీర్‌పేటలోని పెద్ద చెరువు. 70 ఎకరాలకుపైగా విస్తరించి ఉంది. ఇప్పటికే 40 ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో 652 నిర్మాణాలు వెలిశాయి. దీని కింద ఉన్న మంత్రాల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో మరో 580 నిర్మాణాలు ఉన్నాయి. గొలుసుకట్టు చెరువుల్లో భాగంగా దీని కింది భాగంలో ఉన్న మరో చందనచెరువులో 62 నిర్మాణాలు వెలిశాయి. వరద కాల్వలు పూర్తిగా ధ్వంసమవడంతో ఇళ్లు, కాలనీల నుంచి వచ్చిన మురుగునీరు ఈ చెరువులోకి వచ్చి చేరుతోంది. భారీ వర్షాలకు సగం కూడా నిండకపోవడం విశేషం.

❖ తుమ్మలకుంట.. విల్లాలే వెంట

ఇది తుక్కుగూడ మున్సిపాలిటీ సర్దార్‌నగర్ పరిధిలోని సర్వే నంబర్ 2లో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తుమ్మలకుంట. మామిడిపల్లి గుట్టల నుంచి వచ్చే వరదనీరు ఈ చెరువులోకి చేరుతుంది. అటు నుంచి రావిర్యాల పెద్ద చెరువుకు నీరు చేరుతుంది. కొంత మంది రియల్టర్లు ఈ చెరువును పూర్తిగా మాయం చేశారు. చెరువు ఉండాల్సిన చోట విల్లా ప్రాజెక్టులు వచ్చి చేరాయి. ఇటీవల ఇదే అంశంపై హైడ్రా సహా పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయడం కొసమెరుపు.



'డిజిటల్' సర్వేకు సహకరించాలి



సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ప్రత్యేకాధికారి దివ్యదేవరాజన్, ఎమ్మెల్యే తదితరులు

చేవెళ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టిందని కలెక్టర్ శశాంక, జిల్లా ప్రత్యేకాధికారి, ఐఏఎస్ దివ్యదేవరాజన్ అన్నారు. నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుకింద ఎంపిక చేసి ఆ గ్రామంలో ఇంటింటి సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఎంపిక చేసిన దేవరంపల్లిలో చేపట్టిన సర్వే ప్రక్రియను శుక్రవారం వారు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపిక చేసిన గ్రామానికి సంబంధించి పూర్తి డేటాలను రేషన్‌కార్డుల ఆధారంగా ఫాంలు తయారు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. వాటి ఆధారంగా సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి కుటుంబంలోని సభ్యుల వివరాలు, రేషన్ కార్డులు లేని వారి వివరాలను ఒకే కార్డు ఉన్న వేరుపడే వారి వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ సర్వేను ఆన్‌లైన్ చేసి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. పేద ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందరికీ కార్డులు జారీ చేసేలా చూడాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కలెక్టర్‌కు సూచించారు. వారి వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, మాజీ సర్పంచ్ నరహరిరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ' కార్డుతో కుటుంబానికి రక్షణ



ఫ్యామిలీ డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే ఆదిబట్ల మున్సిపాలిటీలో జరుగుతుండగా శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ప్రజలకు కార్డుపై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఒక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్డును తీసుకొచ్చిందన్నారు. అధికారులు ప్రతి ఇంటికీ తిరుగుతూ సర్వేను ప్రారంభించారని తెలిపారు. మున్సిపాలిటీలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో ఈ సర్వే ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కార్డు కుటుంబానికి రక్షణగా ఉంటుందన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఇంటింటినీ సర్వే చేయాలని, ఎక్కడా ఇబ్బందులు తెలెత్తకుండా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి కూతురు నీట్‌లో మెరిసింది



హిందు

చేవెళ్ల: ఇటీవల విడుదలైన నీట్ పరీక్షల ఫలితాల్లో చేవెళ్లకు చెందిన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కందాడ సాయన్న కూతురు హిందు ఉత్తీర్ణత సాధించి కాళోజీ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించింది. ఈ విషయం తెలియడంతో శుక్రవారం ఆమెను, పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ తన కూతురును ఉన్నత చదువులు చదివించిన సాయన్నను గ్రామ నాయకులు అభినందించారు. విషయం తెలిసిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. పేద కుటుంబానికి చెందిన హిందు ఉన్నత చదువుకు ఎంపిక కావటం సంతోషకరమన్నారు. కందాడ సాయన్న సుజాత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు వివాహం కాగా చిన్న కూతురు హిందూను గురుకుల పాఠశాలలో చేర్పించాడు. కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నాడు. సుజాత ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. నిరుపేద కుటుంబం అయినప్పటికీ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. హిందు పదో తరగతి వరకు వికారాబాద్ ఎస్సీ గురుకుల పాఠశాలలో, ఇంటర్ నల్లకంచ గురుకుల కళాశాలలో చదివింది. కళాశాల నుంచి నీట్ పరీక్ష రాసిన ఆమె 466 మార్కులు సాధించింది. అర్హతను బట్టి ఎస్సీ కోటాలో వరంగల్‌లోని కాళోజీ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించింది. పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ పిల్లలు బాగా చదువుకోవాలనే ఆలోచనతో ఉన్నత చదువులు చదించిన సాయన్నను పలువురు అభినందించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని హిందు నిరూపించిందని కొనియాడారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను వంచిస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని అన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీపై దేవుళ్లపై ప్రమాణం చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని మండిపడ్డారు. సగానికి పైగా రైతులు రుణమాఫీ కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. కుంటిసాకులు చెప్పి సంపూర్ణంగా రుణమాఫీ చేయకుంటే రేవంత్ సర్కార్‌పై రైతులే తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో ఏడాదికి రెండుసార్లు రైతుబంధు పంట సాయం అందేదని గుర్తు చేశారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలుపరచకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చినట్లుగా రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, అన్ని పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, పంటల కొనుగోలు సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆదాయ సముపార్జన

ఆరు నెలల్లో రూ.1,436 కోట్లు.. ◆ 45 శాతం ఆర్జించిన ఆర్టీఏ



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: వాహనాలపై విధించే జీవితకాల, త్రైమాసిక తదితర పన్నుల ద్వారా ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో ఇప్పటి వరకు రూ.1436 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వార్షిక ఆదాయ లక్ష్యం రూ.3195 కోట్లు కాగా, ఇందులో 45 శాతం వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే సాధించినట్లు చెప్పారు. శుక్రవారం మణికొండలోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన రవాణా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో ఇప్పటి వరకు సాధించిన ఆదాయం వివరాలను ఆయన వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా రూ.802 కోట్లు, మేడ్చల్–రూ.595 కోట్లు, వికారాబాద్ రూ.39 కోట్ల చొప్పున ఆదాయాన్ని ఆర్జించినట్లు పేర్కొన్నారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ. 161 కోట్లు, జీవిత కాల పన్నుల ద్వారా రూ.1120 కోట్లు, ఫీజుల ద్వారా రూ.92 కోట్లు సర్వీస్ ఛార్జీల ద్వారా రూ.21 కోట్లు, గ్రీన్ టాక్స్ ద్వారా రూ.10 కోట్లు, తనిఖీల ద్వారా రూ.32 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అర్ధ వార్షిక ఆదాయ లక్ష్యం రూ.1792 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.1436 కోట్లతో 80 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు సకాలంలో చెల్లించాలని సూచించారు. తాము నిర్వహించే తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానా విధించవలసి వస్తుందని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో వివిధ జిల్లాల రవాణా అధికారులు సుభాష్‌చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

యాచారం.. ఇదేమి గ్రహచారం

- సీహెచ్‌సీకి శాశ్వత భవనం లేనట్లే
- పాత భవనానికే మరమ్మతులు
- ఇప్పటికే నివేదిక తయారు చేసిన అధికారులు

యాచారం: యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాని(సీహెచ్‌సీ)కి ఇప్పట్లో శాశ్వత భవనం నిర్మాణం లేనట్లే కనిపిస్తోంది. ఈ ఆస్పత్రికి యాచారం మండల ప్రజలే కాక మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్ తదితర మండలాల నుంచి నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. 70 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనంలోనే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరి వర్షాలకు గదుల్లో నీరు చేరుతున్నాయి. పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వైద్యులు, రోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉండి రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ సర్కార్ ఈ ఆస్పత్రిని రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ పర్యవేక్షణలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి వైద్యుల నియమాకం చేపట్టకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాదిరిగానే వైద్య సేవలు అందిస్తున్నారు.

మంజూరైన నిధులతోనే మరమ్మతులు

గత ప్రభుత్వం అప్‌గ్రేడ్ అనంతరం శాశ్వత భవన నిర్మాణానికి సంకల్పించింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు రూ.1.50కోట్ల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నిధులతో 2023 ఆగస్టులో శంకుస్థాపన చేశారు. తదనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. నిధులు మంజూరుకాక పనుల్లో పురోగతి లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పలుమార్లు ఉన్నతాధికారులు, మంత్రులను అడిగినా ఫలితం లభించలేదు.



యాచారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

అధికారుల పరిశీలన పూర్తి

ఇప్పటికే మంజూరైన నిధులతో రూ.50లక్షలు వెచ్చించి పాత భవనానికే మరమ్మతులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కలెక్టర్ శశాంక ఆస్పత్రి పాత భవనాన్ని పరిశీలించారు. ఆస్పత్రి భవన నిర్మణానికి మంజూరైన నిధులు సపరిపడవని.. ఒకవేళ ప్రారంభించినా మూడేళ్ల వరకు కొనసాగే అవకాశం ఉన్నందున పాత భవనానికి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం డివిజన్ పంచాయతీ రాజ్ డీఈఈ శ్రీనివాస్, ఏఈలు సిద్దార్థ, ఉస్మాన్, ఆస్పత్రి ఇన్‌చార్జి నవీన్ తదితరులు మరమ్మతు పనులపై నివేదిక తయారు చేశారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్ పునరుద్ధరణ, టాయిలెట్స్ నిర్మాణం, స్లాబ్‌పై మరమ్మతులు, గదుల్లో పై కప్పుల మరమ్మతులకు నివేదిక తయారు చేశారు.



నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి



సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చినా 24 గంటల పాటు వైద్యులు ఉండడం లేదు. కొత్త భవనానికి మంజూరైన నిధులతోనే పాత భవనానికి మరమ్మతులు చేయడం సరికాదు. ప్రభుత్వం పట్టుఇంచుకుని కొత్త భవనానికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలి. అప్పట్లో కలెక్టర్లు, మంత్రి సబితారెడ్డికి పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వగా కొత్త భవనానికి నిధులు మంజూరు చేశారు.

– కొప్పు సుకన్య, మాజీ ఎంపీపీ, యాచారం

కల్తీకల్లు తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో కల్తీ కల్లు తయారీ కేంద్రంపై ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కల్తీకల్లుతో పాటు, ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివప్రసాద్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పాలకుర్తి రాఘవేందర్ కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు గురువారం ఎస్‌ఓటీ, స్థానికపోలీసులు దాడి చేసి నాలుగు డ్రమ్ముల కల్తీ కల్లు బొలేరో వాహనంలో ఉంచినట్లు గుర్తించారు. చెట్టు నుంచి వచ్చే కల్లుకు అమోనియం బైకార్బొనేట్ పౌడర్, సిట్రిక్ యాసిడ్ కలిపి హైదరాబాద్‌కు తరలిస్నుట్లు తెలిసింది. ఈ దాడుల్లో కల్తీ కల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, 900 లీటర్ల కల్తీకల్లు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాఘవేందర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

ఇబ్రహీంపట్నం: పట్టపగలే ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండుడుగు బంగారు తాళిని లాక్కెళ్లాడు. ఈ ఘటన శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. శేరిగూడ గ్రామానికి చెందిన భారతమ్మ(60) రాందాసుపల్లి పరిధిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పశువులను మేపుతోంది. అటుగా బైక్ పై వచ్చిన గుర్తు తెలియని దుండగుడు తాగునీరు కావాలని అడిగాడు. అంతలోనే ఆమె మెడలోని రెండు తులాల బంగారు తాళిబొట్టును లాక్కుని పరారయ్యాడు. కేకలు వేస్తూ బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మృత్యుఒడి వరకు సాగుపై మమకారం

ఆదర్శ రైతు రామచందర్ మృతి

సుభాష్‌నగర్: అక్కడ గజం స్థలం విలువ రూ.80 వేల నుంచి లక్ష వరకు పలుకుతుంది. చుట్టూ నూతన హంగులతో విల్లాలు, ఎత్తైన భవనాలు మధ్యలో ఆ రైతుకు తాతల నాటి నుంచి సంక్రమించిన 25 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తన ఒంట్లో ఉన్న చివరి రక్తపుబొట్టు వరకు మట్టినే నమ్ముకుని వ్యవసాయం చేశాడు. తన నలుగురు కుమారులకు మెతుకు విలువ చెప్పి, వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని నూరి పోశాడు. చివరికి వృద్ధాప్యంలోనూ సాగు చేస్తూ కన్నుమూశాడు. కుమారులు తండ్రి భౌతికకాయాన్ని తమ పొలం చుట్టూ వాహనంలో తిప్పి అంత్యక్రియలు నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లికి చెందిన ఆదర్శ రైతు పెద్దనోల్ల రావిచెట్టుకింద రామచందర్(84) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆదర్శ రైతుగా ఎంపికై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. మట్టిని అమ్ముకోకు, నమ్ముకొని జీవించు అనే సిద్ధాంతాన్ని రామచందర్ పదేపదే చెప్పుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని అంత్రక్రియలకు గ్రామస్తులు రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఆయనకు నలుగురు కుమారులు ఇద్దరు, కుమార్తెలు ఉన్నారు.



రామచందర్ (ఫైల్)

అంతర్రాష్ట్ర డ్రగ్స్ వ్యాపారికి రిమాండ్

మరో వ్యక్తి కోసం గాలింపు

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్రాష్ట్ర డ్రగ్స్ వ్యాపారిని ఆదిబట్ల పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. రోమి భరత్ కల్యాణి (40) మహారాష్ట్రలో 10వ తరగతి వరకు చదువుకున్నాడు, థాయిలాండ్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. దుబాయ్‌లోని విశ్వవిద్యాలయంలో బీకాం గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. విదేశాల్లో చదువుకునే సమయంలో డ్రగ్స్‌కు బానిసైన రోమి భరత్ కల్యాణి డ్రగ్స్ వ్యాపారిగా మారాడు. చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటుగా మాదకద్రవ్యాల వ్యాపారానికి దిగాడు. ఈ సమయంలో కేరళకు చెందిన టోబితో పరిచయం ఏర్పడింది. ఈ టోబి సహాయంతో కేరళ, బెంగళూరు నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. 2004లో గంజాయి విక్రయిస్తున్నందుకు బాంద్రాలో, 2013లో ముంబైలోని ఖార్‌లో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి కేసులో, 2023 ఉత్తర గోవాలోని గంజాయి కేసులో అంజునా పోలీసులకు పట్టుబడ్డాడు. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత 2024లో గంజాయి విక్రయిస్తూ పంజాగుట్ట పోలీసులకు పట్టుబడ్డాడు. 2024 ఆగస్టు 8న బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం రియల్ ఎస్టేట్ ముసుగులో గోవా, బెంగుళూర్, పూణేలకు వెళ్లాడు. రోమి అరెస్టుకు వారం ముందే టోబీ నుంచి ఓజీ ఖుష్ రకం గంజాయి, స్థానిక గంజాయి రెండింటిని కొనుగోలు చేసి బస్సులో హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఈ నెల 3న పక్కా సమాచారంతో బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు రోమిని పట్టుకున్నారు. 1.5కేజీల గంజాయి, 50 గ్రాముల కొకైన్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ ఎస్‌ఓటీ మురళీధర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డిజిటలైజేషన్‌తో పనిభారం తగ్గుతుంది

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే

సిటీ కోర్టులు: నాంపల్లి కోర్టులో డిజిటలైజేషన్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ సెంటర్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. దీని ద్వారా కోర్టులకు పనిభారం కూడా తగ్గుతుందని తెలిపారు. నాంపల్లి సెషన్స్ కోర్టు జడ్జి బి.సురేశ్, నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజావర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ..డిజిటలైజేషన్ సెంటర్ ముఖ్య ఉద్దేశం..పాత ఫైల్స్ పాడవకుండా అప్‌లోడ్ చేసి పరిరక్షించడమే అన్నారు. దీని ద్వారా ప్రతి ఫైల్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందన్నారు.

చోరీ కోసం మహారాష్ట్ర టు హైదరాబాద్

- తన వెంటే స్నేహితులనూ తీసుకొచ్చిన రోషన్ కదమ్
- పాట్ మార్కెట్‌లోని జ్యూవెలరీ కార్ఖానాలో పనిలో చేరిక
- నాలుగో రోజే రూ.30 లక్షల నగదుతో అంతా పరారీ
- 24 గంటల్లో కేసును ఛేదించిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: మహారాష్ట్రకు చెందిన రోషన్ కదమ్..జ్యువెలరీ కార్ఖానాలను టార్గెట్‌గా చేసుకుని నగరానికి చేరుకున్నాడు. తన వెంట ముగ్గురు స్నేహితులు, ఓ కారును తెచ్చుకుని సికింద్రాబాద్‌లోని లాడ్జిలో బస చేశాడు. ఓ సంస్థలో ఉద్యోగంలో చేరిన నాలుగో రోజే రూ.30 లక్షలు తీసుకుని స్నేహితులతో కలిసి ఉండాయించాడు. దీనిపై సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర శుక్రవారం వెల్లడించారు. సతారా జిల్లాకు చెందిన రోషన్‌కు నగరం కేంద్రంగా జరిగే పసిడి వ్యాపారంపై అవగాహన ఉంది. ఇక్కడి పసిడి కార్ఖానాల యజమానులు తక్కువ జీతానికి పని చేసే ఉద్యోగుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడతారని గ్రహించాడు. దీంతో ఓ కార్ఖానాను దోచుకోవాలనే పథకాన్ని తన స్నేహితులు ముజామిల్, పృథ్వీరాజ్, ప్రసాద్‌లకు చెప్పాడు. వాళ్లూ అంగీకరించడంతో అంతా కలిసి కారులో గత నెల 28న నగరానికి చేరుకుని సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేశారు. గత నెల 30వ తేదీన రోషన్ పాట్ మార్కెట్‌లోని పసిడి కార్ఖానాలో చేరాడు. గురువారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఈ సంస్థ యజమానితో కలిసి 400 గ్రాముల బంగారు ఆభరణాలను సమీపంలోని ఎస్ఎం జ్యువెలర్స్‌లో ఇచ్చి, నగదు తీసుకురావడానికి వెళ్లాడు. తాము అలా వెళ్తున్న విషయం ఫోన్ ద్వారా స్నేహితులకు చెప్పి కారులో సహా ఆ సమీప ప్రాంతానికి రమ్మని చెప్పాడు. బంగారు ఆభరణాలు ఇచ్చి, రూ.30 లక్షల నగదు తీసుకుని ఓ బ్యాగ్‌లో పెట్టుకున్నారు. కార్ఖానా యజమాని ముందు నడుస్తుండగా..రోషన్ నగదు బ్యాగ్‌తో కాస్త వెనుక వస్తున్నాడు. అదును చూసుకుని యజమాని కళ్లుగప్పి తమ కారులో ఎక్కి మిగిలిన ముగ్గురితో కలిసి ఉండాయించాడు. బెంగళూరు పారిపోయిన తర్వాత నగదు పంచుకుందామని, ఆపై ఎవరి దారిన వాళ్లు వెళ్దామని ఈ నలుగురూ భావించారు. పసిడి కార్ఖానా యజమాని ఫిర్యాదుతో మార్కెట్ ఠాణాలో కేసు నమోదైంది. ఈ నేరంపై సమాచారం అందుకున్న ఉత్తమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు పి.గగన్‌దీప్, శ్రీనివాసులు దాసు సాంకేతిక ఆధారాలతో పాటు ఇతర అంశాలను బట్టి దర్యాప్తు చేశారు. 24 గంటల్లోనే నలుగురు నిందితుల్లో రోషన్, ముజామిల్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.29.92 లక్షల నగదు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మార్కెట్ పోలీసులకు అప్పగించిన టాస్క్‌ఫోర్స్... పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తోంది.

నేడు కొంగరకలాన్‌కు ముఖ్యమంత్రి రాక

ఫాక్స్‌కాన్‌లో పనులు పరిశీలించనున్న రేవంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కొంగరకలాన్‌కు రానున్నారు. జిల్లా కలక్టరేట్ ఎదుట కొనసాగుతున్న అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్ పనులను పరిశీలించనున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనపై కంపెనీ ప్రతినిధులతో చర్చించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో సాయంత్రం 4గంటల వరకు కొంగరకళాన్ చేరుకుంటారని అధికార వర్గాల నుంచి తెలిసింది.

చికిత్స పొందుతున్న రైతు మృతి

శంకర్‌పల్లి: చికిత్స పొందుతున్న రైతు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్‌కు చెందిన రాములు(47) ఈ నెల 1న చిన్నశంకర్‌పల్లిలో ఉన్న తన పొలానికి బైక్‌పై వెళ్తున్నాడు. బైక్ అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. అయినప్పటికీ ఆస్పత్రికి వెళ్లకుండా నిర్లక్ష్యం వహించాడు. గురువారం రాత్రి గాయాలతో ఇబ్బంది పెరగడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన పట్టణంలోని గంజ్‌లో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్ఐ సుశీల తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గంజ్‌లో ఉన్న ఓ రేకుల షెడ్డులో ఓ గుర్తు తెలియని వృద్ధుడు(60) పడి ఉన్నాడు. ఎటువంటి చలనం లేకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ సుశీల ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబధీకులు ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఆమనగల్లు మండల ప్రత్యేక అధికారిగా ఆదిలక్ష్మి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆదిలక్ష్మి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల ప్రత్యేకాధికారిగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆదిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ వరకు ప్రత్యేకాధికారిగా మహేశ్వరం డివిజన్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుజాత బదిలీ అవ్వడంతో ఆదిలక్ష్మిని నియమించారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపీడీఓ మాధురి, మండల కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా సన్మానించారు.